నామకరణం చేశారు.. వసతులు మరిచారు

- కన్నా విజయలక్ష్మి తండాలో సౌకర్యాలు కరువు
- సీసీ రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్న వాసులు
- మంచి నీటి సౌకర్యం కల్పించాలంటున్న గిరిజనులు
- నిరుపయోగంగా ఉన్న కుళాయిల ట్యాంక్



కన్నా విజయలక్ష్మి తండా ఏరియల్ వ్యూ



నిరుపయోగంగా ఉన్న కుళాయిల ట్యాంక్

రాజుపాలెం: వాళ్లంతా గిరిజనులు.. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. నిత్యం ఏదో ఒక పని వెతుక్కుని పోవాల్సిన దుస్థితి. మరి కొంతమంది అడవి కట్టెలు అమ్ముకుని పొట్ట పోసుకుని జీవనం సాగిస్తుంటారు. 25 ఏళ్ల క్రితం సుదీర్ఘ ప్రాంతాల నుంచి పొట్టచేత పట్టుకుని పనుల నిమిత్తం మండలంలోని నెమలిపురి గ్రామానికి వచ్చారు. ప్రతీ రోజు అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకుని వచ్చి గ్రామంలో తిరిగి అమ్ముకునేవారు. ఆ సమయంలో గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో కొండకు సమీప ప్రాంతంలో రెవెన్యూ పోరంబోకు ఉంది. అందులో పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తు వారికి ఉన్న ఆవులు, మేకలను దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతంలో మేపుకుని జీవనం సాగిస్తున్నారు.

ఒక్కొక్కరికి 3 సెంట్ల స్థలం

నెమలిపురి పరిధిలో 70 మంది గిరిజనులకు ఒక్కొక్కరికి మూడు సెంట్ల చొప్పున స్థలం కేటాయిస్తూ నాలుగు నిలువు బజారులు, ఒక అడ్డ బజారును అధికారులు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కన్నా విజయలక్ష్మి తండాగా నామకరణం చేశారు. ఇచ్చిన స్థలాల్లో కొంతమంది రేకుల షెడ్‌లు వేసుకుని ఉంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన బజారులలో తట్ట మట్టికూడా పోయలేదు. బజారులు మొత్తం ముళ్ల కంచెలతో నిండి ఉండడం వలన చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయమేస్తుందని స్థానికులు వాపోతున్నారు.

- వర్షాకాలంలో బజారులన్నీ నీళ్లతో నిండి ఉండడం వలన నడవడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. నెమలిపురి నుంచి తండా మూడు కిలోమీటర్లు డొంక రహదారి కావడంతో చిన్నపాటి వర్షానికే ఆ మూడు కిలోమీటర్లు నడవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందంటున్నారు గిరిజనులు.



అధ్వానంగా ఉన్న నెమలిపురి-తండా రహదారి

- తండా నుంచి ప్రతి రోజు సుమారు 20 మంది పిల్లలు కాలినడకన నెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఇప్పటికీ తండాలో చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయలేదు. పాఠశాల లేక పోవడంతో చిన్న పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. బోరింగ్ నీళ్లు తాగడం వలన కడుపు మంట, నొప్పి వంటివి వస్తున్నాయని తండా వాసులు అంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి....



తండాలో చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంను ఏర్పాటు చేయాలి. మేము కూలీనాలి పని చేసుకునే వాళ్లం. పనులకు వెళ్లినప్పుడు పిల్లలకు భద్రతలేదు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తే ఆ టీచరమ్మే పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటుంది. ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం పెడుతుంటది. అధికారులు స్పందించాలి.

– మంగీబాయి, తండా

సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి



తండాలో బజారులైతే విడగొట్టారు. ఇంత వరకు తట్ట మట్టి పోయలేదు. నెమలిపురి నుంచి తండా వరకు సీసీ రోడ్డు వేయాలి. పాఠశాలలకు వెళ్లే పిల్లలు అల్లాడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా బడికి ఎగనామమే. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– పానుగోతు స్వామీనాయక్, తండా

బోరు నీటి వలన రోగాలు



బోరు నీరు తాగడం వలన పిల్లలకు, పెద్దలకు రోగాలు వస్తున్నాయి. అప్పుడప్పుడు విరేచనాలు అవుతున్నాయి. చిన్న పిల్లలకు కడుపులో మంట, పెద్ద వాళ్లకు కడుపు ఉబ్బకొచ్చినట్లు ఉంటుంది. దాతలు గానీ, ప్రభుత్వం గానీ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నా.

– పానుగోతు సానీబాయి, తండా

మరణంపై ఏసు సాధించిన విజయానికి గుర్తు ఈస్టర్

చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు

సత్తెనపల్లి: సిలువపై ప్రాణాలు విడిచిన ఏసుక్రీస్తు తిరిగి పునరుత్థానుడై ప్రజల మధ్యకు వచ్చిన రోజునే ఈస్టర్ పండుగ జరుపుకోవడం జరుగుతుంది అని పాస్టర్లు, మత పెద్దలు తెలిపారు. ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పట్టణం, మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు, మత పెద్దలు మాట్లాడుతూ మరణంపై ఏసుక్రీస్తు సాధించిన విజయానికి గుర్తుగా ఈస్టర్ పండుగ జరుపుకోవడం జరుగుతుందన్నారు. పాపులను రక్షించటం గుడ్ ఫ్రైడే సందేశమైతే, అంతం చేయాలన్న ప్రతిసారీ సత్యమన్నది ఏదో రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నది ఈస్టర్ నేర్పిన పాఠమన్నారు. ఈస్టర్‌ను కొత్త జీవితం, ఆశ, విశ్వాసానికి చిహ్నంగా భావిస్తారని ఏసు చూపిన శాంతి మార్గంలో అందరూ ప్రయాణించాలని కోరారు. ఏసు మార్గంలో నడవాలని, సాటి మనుషుల పట్ల ప్రేమ, కరుణ చూపాలని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని క్రీస్తు పునరుత్థాన ఘటనలను క్రైస్తవ సోదర, సోదరీమణులు, విశ్వాసులతో చదివించి అర్థాన్ని వివరించారు. వేకువజాము నుంచే రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. నూతన దుస్తులు ధరించి చర్చిల్లో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఏసును కీర్తిస్తూ పాటలు పాడారు.

నకరికల్లులో...

నకరికల్లు: సర్వపాపాలను హరించేందుకు క్రీస్తు మరలా జన్మించారని పలువురు పాస్టర్‌లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలలో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్‌లు మాట్లాడుతూ సర్వలోక రక్షకుడు క్రీస్తు అని అన్నారు. సిలువ వేయబడిన మూడవ రోజు పాపులను కాపాడేందుకు తిరిగి వచ్చారని తెలిపారు. ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీస్తు త్యాగాలను స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



రాజుపాలెంలోని చర్చిలో ప్రార్థనలు

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రాజుపాలెంలోని చర్చిలో పాస్టర్ రెవరెండం అత్తోట మత్తయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పర్వదినం ప్రాముఖ్యతను క్రైస్తవులకు వివరించారు. మండలంలోని ఇనిమెట్ల, ఉప్పలపాడు, గణపవరం, అనుపాలెం, కోటనెమలిపురి, పెదనెమలిపురి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ఆరాధికు లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

క్రోసూరు: ఈస్టర్ పండుగ వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు, చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం క్రోసూరు గ్రామంలోని లూథరన్ చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా వేకువజామునే విశ్వాసులు చర్చి వద్ద నుంచి కొవ్వొత్తులు పట్టుకొని గ్రామ ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. పాటలు పాడుతూ క్రీస్తు సిలువ వేయబడిన మూడవ రోజు ఈస్టర్ రోజున మరణం జయించి లేచాడని తెలుపుతూ సమాధుల తోట వరకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చర్చిలో పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ రెవ. డాక్టర్ ఎం.సుందరరావు, చిలకా హెప్సిభా పాస్టరమ్మ వాక్య సందేశం అందించారు. వారు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజు యేసు సిలువలో మరణించాడని మూడవ రోజున మరణం జయించి తిరిగి లేచాడని తెలిపారు. యేసు మరణం జయించుట ద్వారా ఈ లోక ప్రజలు అందరికీ పరలోక ప్రవేశం ఇవ్వబడిందని చెప్పారు. యేసు చెప్పిన ప్రేమ, జాలి, దయ, కరుణ అనే గుణాలు ప్రజలందరూ కలిగి ఉండాలని అన్నారు. ప్రపంచ శాంతి కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విశ్వాసులకు ఫలహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంఘ పెద్దలు, విశ్వాసులు అశేషంగా పాల్గొన్నారు.



సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన దృశ్యం

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోను క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు పునరుత్థానం పొందిన రోజున ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. పండుగను పురస్కరించుకొని చనిపోయిన పెద్దల సమాధులను సందర్శించి శుభ్రం చేసి రంగులు వేసి పూలతో అలంకరిస్తారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల సంఘ కాపరులు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని క్రీస్తు సందేశాన్ని అందించారు. గోళ్ళపాడులోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం

పెదకూరపాడు: క్రీస్తు మార్గం ఆచరణీయమని మార్నింగ్ స్టార్ అధినేత జవ్వాది సతీష్ అన్నారు. పెదకూరపాడులోని క్రీస్తు లూథరన్ సంఘం దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రీస్తు సందేశం ఇచ్చారు. ఈస్టర్ సందర్భంగా మండల వ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. మానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై ప్రాణత్యాగం చేసి తిరిగి లేచారని పలువురు పాస్టర్లు సందేశం ఇచ్చారు. పెదకూరపాడులోని లూథరన్, తెలుగు బాపిస్టు, ఆర్‌సీఎం, క్రీస్తు సంఘం, పెంతెకోస్త్, హోసన్నా, ఫెలోషిప్ సంఘాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఇరుకుపాలెం లూథరన్ చర్చిలో క్రీస్తు సందేశాన్నందిస్తున్న పాస్టర్ మధిర నాగేశ్వరరావు



పెదకూరపాడు లూథరన్ చర్చి దేవాలయంలో క్రీస్తు సందేశం ఇస్తున్న జవ్వాది సతీష్



పెదకూరపాడులో ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు

24న భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

సీఐటీయూ నాయకులు

క్రోసూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేయాలని ఈ నెల 24న పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పల్నాడు భవన, ఇతర కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం క్రోసూరు మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం గాంధీ బొమ్మల సెంటర్‌లో కార్మికుల అడ్డా వద్ద జరిగింది. ఈ సందర్భంగా ధర్నా కరపత్రాలను యూనియన్ నాయకులు కంభంపాటి మల్లికార్జునరావు, బత్తుల కొండలు, చిలకా చిన్న యేసయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిలార్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. గత ఎన్నికల్లో కూటమి నేతలు చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లు హామీ ఇచ్చినట్లు 1214 జీవోను రద్దు చేసి కార్మికులకు పథకాలను పునరుద్ధరించాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోరుతూ 24న నరసారావుపేటలోని గాంధీ పార్క్ వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందని, కార్మికులందరూ హాజరై ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసరావు, ఏపూరి నరసింహారావు, షేక్ చిన్న కరిముల్లా, సీహెచ్ నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, కంభంపాటి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

ఆదమరిస్తే ప్రమాదమే

- విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సిబ్బంది సూచనలు

పెదకూరపాడు: రోజువారీ జీవితంలో విద్యుత్ ఎంత అవసరమో ఆదమరిస్తే అంతకన్నా ఎక్కువ ప్రమాదాలే జరుగుతుంటాయి. రోజురోజుకీ పెరుగుతున్న వినియోగంతో పాటు ప్రమాదాలు సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం అధికమైంది. గృహోపకరణాల వైరింగ్‌లో లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా వినియోగదారులకు తెలియకుండానే నష్టం జరుగుతుంది. చిన్నవే కదా అని ఆదమరిస్తే ఊహించని రీతిలో నష్టపోవాల్సి వస్తుంది.

అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ వినియోగించేటప్పుడు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ఉపకరణాల మరమ్మతులు, వైర్లు సరిచేయడం వంటివి సొంతంగా చేయడం మంచి పద్ధతి కాదు. నాసిరకం ఉపకరణాలు, వైర్లు తీసుకుంటే ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్టే. వేసవిలో మరింత అప్రమత్తంగా ఉండాలి. తీగలు వేడెక్కే అవకాశం ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ వైర్లు, పరికరాలు ఐఎస్ఐ మార్క్ ఉన్నవే వినియోగించాలి.



పెదకూరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్

జాగ్రత్తలు తీసుకోవాలి



ఇళ్లలో ప్రమాదకరంగా ఉన్న పాత వైరింగ్‌ను మార్చి కొత్తగా వైరింగ్ చేయించుకోవాలి. విద్యుత్ పనుల్లో తర్ఫీదు పొందిన ఎలక్ట్రీషియన్ చేతనే వైరింగ్ చేయించుకోవాలి. సరైన ఎర్త్ లేకపోతే విద్యుత్ ఉపకరణాలు దెబ్బతినే ప్రమాదముంది. ఒకే చోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించడం వల్ల కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– దాసరి రామకృష్ణ, విద్యుత్ ఏఈ, పెదకూరపాడు

విద్యుత్ లోడ్ అంతా ఒకే ఫ్యూజ్‌పై పడకుండా చూసుకోవాలి. ఇళ్లల్లో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే అధిక లోడ్ వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయి. నియోజకవర్గంలో 40 వేల గృహాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

కంకర పరిచారు.. తారు మరిచారు



న్యూ చిట్యాల వద్ద కంకర తేలిన రహదారి



పాపాయపాలెం వద్ద లారీ వెళ్తున్న సమయంలో దుమ్ము

బెల్లంకొండ : కొండ నాలుకకు మందువేస్తే.. ఉన్న నాలుక ఊడిన చందంగా తయారయింది మండలంలోని న్యూచిట్యాల నుంచి పాపాయపాలెం వరకు గల రహదారి పరిస్థితి. రహదారికి గుంతలు పడడంతో మరమ్మతుల పేరుతో దాదాపు రెండు నెలల క్రితం అధికారులు ఉన్న రహదారిని తవ్వారు. తవ్విన వారం రోజుల తర్వాత కంకర పరిచారు. కాగా మరమ్మతులు చేపట్టి రెండు నెలలు కావస్తున్నప్పటికీ తారు వేయలేదు. దీంతో కంకర తేలిన రహదారిపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వచ్చే దుమ్ము ధూళితో అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతు పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కందుకూరి అవార్డు గ్రహీత బత్తినేనికి సత్కారం



సత్తెనపల్లి: ప్రభుత్వం నుంచి కందుకూరి వీరేశలింగం విశిష్ట అవార్డును అందుకున్న కళాకారుడు బత్తినేని వెంకట లక్ష్మయ్యను స్థానిక ఉషోదయ కళా పరిషత్, పట్టణ కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ సీపీఎం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి నటుడు, రంగస్థల రచయిత పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించగా మునుసూరి శేఖర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాములయ్య మాట్లాడుతూ కళలు సాంఘిక రుగ్మతలను తొలగించి విశ్వ మానవ శ్రేయస్సుకు తోడ్పడతాయన్నారు. వేదాలలో కళలకు, కళాకారులకు విశిష్ట స్థానం ఉందని, బత్తినేని వెంకట లక్ష్మయ్య కళారంగానికి నటుడిగా చేసిన కృషికి గాను ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం విశిష్ట అవార్డుతో గౌరవించిందన్నారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో కళాకారులను గుర్తించి ప్రభుత్వం గౌరవించడం, ఆర్థికంగా సహకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత బత్తినేని వెంకట లక్ష్మయ్యను పూలమాలలు, దుశ్శాలువలు, కిరీటంతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు, కళాకారులు పత్తిగుడుపు సత్యనారాయణ రాజు, ఎలిశెట్టి వెంకట ప్రసాదరావు, సింగర్ ప్రసాదు, ధారా బ్రదర్స్, కాటుమాల బ్రదర్స్, పొత్తూరు రామకోటయ్య, మునగా వెంకటేశ్వరరావు, శిఖా ఆదామ్, కె.ప్రేమ్ కుమార్, అనుపమ కేర్, వెంకట్, కల్లూరి నాగ బ్రహ్మచారి, పిల్లుట్ల ఆంజనేయులు, కన్నెగట్టు శ్రీనివాసరావు, గొట్టం ఆంజనేయులు, ఈవీ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా పుష్పయాగం



మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని 16 రోజుల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వేణుగోపాలాచార్యులు, కమిటీ అధ్యక్షుడు బచ్చు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 వేల మందికి పైగా అన్నదానం నిర్వహించారు. రాత్రి స్వామి వార్లకు పల్లకి సేవ జరిగింది. భక్తులు వేలాది మంది పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి బాల కోటేశ్వరరావు, మారం శ్రీనివాసరావు, చీదెళ్ళ ఆంజనేయులు, పోలూరి వెంకటేశ్వర్లు, విడేల సీతాలక్ష్మి నారాయణ, గుండా శ్రీను, బత్తుల బ్రహ్మం, కర్నాటి అప్పారావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పిడుగురాళ్ల: మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి ఆదర్శంగా నిలవాలని రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు అన్నారు. పట్టణంలోని ఎల్ఎస్ పిక్చర్ ప్యాలెస్ పక్కన సెక్రటరీ నీరుమళ్ల రాజేష్ ఇంటి వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లను అందించారు. ఈ సందర్భంగా గుండా అశోక్‌బాబు మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి కోసం మిషన్లు పంపిణీ చేసామన్నారు. పొట్టి భాస్కర్ (యూఎస్ఏ) ఆర్థిక సాయం చేయడంతో 10 మిషన్లు మహిళలకు అందించామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, భవనాశి నరసింహారావు, కాకుమాను శ్రీనివాసరావు, ఎస్.ముత్తారెడ్డి, ఏలూరి పుల్లారావు, గర్నె సుబ్రహ్మణ్యం, గుండా గురవయ్య, పసుమర్తి రమేష్, కొత్త రవి, హరికృష్ణ, ఎస్‌కే మౌలా సాహెబ్, మాచర్ల శ్రీనివాస్, వంకాయల గోపీ, ఈవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. ఈ నెల 14న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగింపు సందర్భంగా పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయాలన్నారు. అగ్నిమాపక వాహనం వచ్చేలోపు వీలైనంత వరకు మంటలను నియంత్రించేందుకు నీటిని చల్లాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఎస్కే గౌస్, డ్రైవర్ ఆపరేటర్ డి.విజయ భాస్కర్ రెడ్డి, ఫైర్ మాన్లు వై.మహేంద్రరెడ్డి, ఎం.రమణనాయక్, పి.గోవిందు, బి.నాగేశ్వరరావు, హోంగార్డులు షేక్ సుభాని, షేక్ బాజీ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ, అంకమ్మ తల్లి కొలుపులు



సత్తెనపల్లి: మండలంలోని బృగుబండ గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవతలు పోలేరమ్మ తల్లి, అంకమ్మ తల్లి అమ్మవార్ల కొలుపుల కార్యక్రమం ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజలకు వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుదీర్ భార్గవ రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి మాజీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గండు పద్మావతి సాంబశివరావు, నాయకులు ఇనుకొల్లు దేశిబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడేవారు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మాతంగి సాంబశివరావు అన్నారు. పట్టణంలో రోటరీ క్లబ్, వాసవి మణికంఠ క్లబ్ ఆధ్వర్యంలో సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జ్వరాలు, నరాల సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు, ఇతర జనరల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. అలాగే నిమ్ము, ఉబ్బసం, ఆయాసం, దీర్ఘకాలిక దగ్గు, ఎలర్జీ, తుమ్ములు, ముక్కు కారుట, ఇతర శ్వాసకోశ, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 150 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. డాక్టర్లు సింగరాజు విద్య, సింగరాజు సాయి కృష్ణ సేవలందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, వాసవి మణికంఠ క్లబ్ జోనల్ చైర్మన్ వనమా నాగేశ్వరరావు, అధ్యక్షుడు కొప్పరావూరి కాశీ వెంకట సుబ్బారావు (గోపాల ట్రేండ్స్), సెక్రటరీ సూరె శ్రీనివాసరావు, ట్రెజరర్ కాశీ విశ్వేశ్వరరావు, రోటరీ క్లబ్ డైరెక్టర్ లేళ్ల అయోధ్య కృష్ణ, సుభాని మాస్టర్, మాతంగి రాహుల్ గౌతమ్, వాసవి మణికంఠ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి అందజేత భేష్



మాచర్ల రూరల్: వేసవి కాలంలో రైల్వే ప్రయాణికులకు స్టేషన్ ఆవరణలో మొబైల్ వాహనం ద్వారా ఉచితంగా మంచినీటిని అందిస్తున్న ఉప్పుతోళ్ళ శ్రీను సేవలు అమూల్యమని రైల్వే డీసీఎం కమలాకర్ అన్నారు. ఆదివారం పట్టణ రైల్వే స్టేషన్ ఆవరణలో శ్రీను ఉచితంగా మినరల్ కూలింగ్ వాటర్ అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. శ్రీను సేవా దృక్పథం ఎనలేనిదన్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి తగు సమాచారాన్ని తమకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు పచ్చిపాల ప్రభాకర్, నసీబ్ బాషా, స్టేషన్ మాస్టర్లు బి.కె.నాయక్, శివప్రసాద్ ఉన్నారు.